క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు పార్టీ తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమరా నాగయ్య శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశానికి వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షులు గంజి చిరంజీవి, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి తదితరులు హాజరు అవుతారని పేర్కొన్నారు. మంగళగిరి బైపాస్‌రోడ్‌లోని కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల గ్రామంలోని కంభంపాటి నారాయణ జూనియర్ కళాశాలలో ఆదివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి బి. రాంబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు హైదరాబాద్‌లోని ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ వారి సహకారంతో వెరికోసిల్ వెయిన్స్ వైద్య శిబిరం ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు

ఫిరంగిపురం: మండలంలోని నుదురుపాడు గ్రామ శివారులోని లక్ష్మీనారసింహస్వామికి శనివారం శ్రవణానక్షత్ర పూజలు చేశారు. ఉదయాన్నే స్వామికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వారికి నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. పూజా కార్యక్రమాల నిర్వహణను మానుకొండ సుబ్బారెడ్డి, వెంకటరమణ దంపతులు పర్యవేక్షించారు.

సందడిగా వన సమారాధన



మంగళగిరి: ఎకో పార్కులో ఫ్రెండ్స్ ఫరెవర్ ఆధ్వర్యంలో శనివారం మహిళల వన సమారాధన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు ఆటలు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఫ్రెండ్స్ ఫరెవర్ పేరుతో ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసి సమాజంలో ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రతినిధులు మాజేటి పార్వతి, పసుమర్తి సుజాత, నేరెళ్ల వాణి, పారేపల్లి రమ్య, మంచికంటి జ్యోతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలపై అవగాహన

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని కార్మెల్ మాత మందిరం వద్ద సెయింట్ జోసఫ్ హాస్టల్ విద్యార్థులకు శనివారం నైతిక విలువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిస్టర్ శైలీన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఎలా నడుచుకోవాలి, తోటి పిల్లలతో ఎలా మెలగాలి, చెడు వ్యసనాలకు బానిస కాకుండా జీవితాలను ఎలా చక్కదిద్దుకోవాలనే అంశాలను వివరించారు. అనంతరం బాల ఏసు దేవాలయ సహాయ విచారణ గురువులు రవీంద్ర, సిస్టర్ షీలాలు కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు.

వైద్య వృత్తి దేవుడిచ్చిన వరం



మంగళగిరి: ప్రజలకు కాపాడేందుకు దేవుడు ఎంపిక చేసుకున్న వారే వైద్యులు అని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మంగళగిరి ఎన్నారై మెడికల్ కళాశాల విద్యార్థులతో శనివారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మంత్రి పెమ్మసాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి రోగి బాధను తనదిగా వైద్యుడు భావించగలిగిన నాడు ఒక్క తప్పు కూడా జరగదన్నారు. అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో కాలేజీ ప్రతినిధులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అత్యాధునిక వైద్య పరికరాల స్కిల్ ల్యాబ్‌ను మంత్రి ప్రారంభించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ఏకాదశ వార్షికోత్సవం సందర్భంగా మొదటిరోజు శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో వేద పండితులు వెంకటాచార్యులు, వీరాచార్యులు, మంజునాథన్, పరబ్రహ్మాచారి, వెంకటేశ్వరచారి, వీరబ్రహ్మాచార్యులు ఆధ్వర్యంలో మండపారాధన, పుణ్యాహవాచనం నిర్వహించారు. స్వామి, గోవిందమాంబలకు అభిషేకాలు చేశారు. శాంతి కళ్యాణం, విశేష అర్చనలు జరిగాయి. అనంతరం యాగశాలలో హోమాలు చేశారు. కార్యక్రమాలను ఆలయ మేనేజింగ్ ట్రస్టీ ఎస్‌వీఎస్ కుమార్‌దేవ్ పర్యవేక్షించారు.

మెరుగైన వైద్యసేవలకు అవకాశం

- వంద పడకలకు మంగళగిరి ఆసుపత్రి ఎట్టకేలకు అప్‌గ్రేడ్
- 73 పోస్టులు, వసతుల కల్పనకు నిధులు మంజూరు



ఆసుపత్రి లోపలి భాగం



మంగళగిరి ప్రభుత్వాసుపత్రి భవనం

మంగళగిరి: మంగళగిరి ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఎన్నో ఏళ్లుగా స్థానికులు ఇక్కడి ఆసుపత్రిని 100 పడకలకు పెంచాలని కోరుతున్నారు. ఎట్టకేలకు వారి డిమాండ్ నెరవేరింది. 30 పడకల ఏరియా ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసింది. 73 మంది సిబ్బంది నియామకానికి వీలుగా పోస్టులు, వసతులకు రూ. 56 కోట్ల నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వైఎస్సార్ సీపీ హయాంలో ప్రతిపాదనలు

ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రభుత్వాసుపత్రి భవనం శిథిలావస్థకు చేరడంతోపాటు ఆసుపత్రిలో సరైన వసతులు కూడా లేవు. వైద్యులు, సిబ్బంది సరిపడా లేక పెద్ద ఎత్తున వచ్చే రోగులకు నామమాత్రంగానే సేవలు అందుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలోనే ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదనలు పంపించగా... సాంకేతిక కారణాలతో నిలిచిపోయాయి. ఇప్పుడు అవి తొలగిపోవడంతో ఆసుపత్రి అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు కూటమి సర్కారు పేర్కొంది.



ఆపరేషన్ థియేటర్



ఆసుపత్రిలోని పడకలు

ఎంతో ఉపయోగకరం

మంగళగిరితోపాటు చుట్టుపక్కల గ్రామాలు, తాడేపల్లి, దుగ్గిరాల మండల ప్రజలు ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్నారు. ఆసుపత్రిలో ప్రస్తుతం ఇద్దరు వైద్యులు, 13 మంది సిబ్బంది మాత్రమే ఉన్నారు. అప్‌గ్రేడ్ నిర్ణయం నేపథ్యంలో 11 మంది వైద్యులు, 73 సిబ్బందితో పూర్తి స్థాయి వైద్య సేవలు అందే అవకాశం కలగనుంది. 1985లో నిర్మించిన ఆసుపత్రి భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. కొద్ది సంవత్సరాలుగా ప్రజాసంఘాలతోపాటు ప్రజలు 100 పడకలకు దీన్ని పెంచాలని కోరుతున్నారు. ఇప్పటికే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పాలనలో నగరంలో 30 వేల మందికి ఒక అర్బన్ హెల్త్ సెంటర్ చొప్పున మొత్తం 9 సెంటర్‌లు నిర్మించగా.. అక్కడా రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. మరో వైపు ఎయిమ్స్‌లో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో పలువురు సేవలు పొందుతున్నారు.

గ్రామీణ విద్యార్థులకు అండగా ‘స్టార్స్’



ల్యాప్‌టాప్‌లు అందుకున్న విద్యార్థులతో వీఐటీ ప్రతినిధులు

తాడికొండ: గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా నిలిచేలా సపోర్ట్ ద అడ్వాన్స్ ఆఫ్ రూరల్ స్టూడెంట్స్ (స్టార్స్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వీఐటీ విశ్వవిద్యాలయం వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్ తెలిపారు. వీఐటీ ఏపీ స్టార్స్ పథకంలో 26 జిల్లాల నుంచి ఒక విద్యార్థిని, ఒక విద్యార్థి చొప్పున ప్రతిభ కలిగిన వారికి శనివారం ఉచిత ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు ఉన్నత విద్యతోపాటు వసతి, ప్రాథమిక వైద్యం పూర్తి ఉచితంగా అందిస్తున్నామన్నారు. వర్సిటీ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల పాలిట వరం ఈ స్టార్స్ కార్యక్రమం అన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. స్టార్స్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి. వెంకటలక్ష్మి, అడ్మిషన్స్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జాన్ ప్రదీప్ పాల్గొన్నారు.

ప్రైవేటు రంగంలోనూ రిజర్వేషన్లు కల్పించాలి



మాట్లాడుతున్న ఎల్.జైబాబు

మంగళగిరి: ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని సోషలిస్ట్ జనతా కాంగ్రెస్ కూటమి జాతీయ నేత ఎల్.జైబాబు డిమాండ్ చేశారు. మంగళగిరి ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్‌లో శనివారం పలు పార్టీలు, ప్రజా సంఘాలు, సామాజిక వేత్తలతో కూటమి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. గుంటూరు జిల్లా అధ్యక్షుడు పొదిలి వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఎల్. జైబాబు మాట్లాడుతూ గ్లోబలైజేషన్‌తో ప్రైవేటు రంగం 90 శాతానికి పెరిగిందన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహిస్తు నందున రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ పెంచి మార్పు తీసుకురావాలని కోరారు. అన్ని జిల్లాల్లో చైతన్యం కోసం సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. డిసెంబర్ 6న రాష్ట్ర సదస్సు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కంచర్ల కాశయ్య, కాంగ్రెస్ నాయకులు జీవన్ సాగర్, సోషలిస్ట్ కూటమి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓర్సు వీర భాస్కర్, యూసఫ్ అహ్మద్, సునీల్, నవీన్, కె.గణేష్, పి.అశోక్, బండి దశావతారం, కె.జానీ, బత్తుల ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పోరును జయప్రదం చేయండి



ఏసీసీ కార్మికులతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు శనివారం సందర్శించారు. కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో మాట్లాడుతూ సరైన ఉపాధి లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వాలు నిత్యావసర సరకుల ధరలు ఇష్టం వచ్చినట్లు పెంచాయన్నారు. ధరల మీద ప్రభుత్వాలు నియంత్రణ కోల్పోయాయని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గినా దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు మాత్రం తగ్గడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు ఇప్పుడు అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. ట్రూ అప్ పేరుతో ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపుతున్నారని మండిపడ్డారు. ఇసుక బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సి వస్తోందని నిర్మాణ కార్మికులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ధరలు తగ్గించాలని ఈ నెల 14వ తేదీ తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించనుందని తెలిపారు. పెద్దసంఖ్యలో కార్మికులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, సీపీఐ నాయకులు కె ఆదినారాయణ, సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, నేతలు కొట్టే కరుణాకర్‌రావు, కార్మికులు వై. యహోషువా, నాగేశ్వరరావు, ఆశీర్వాదం, బి. అంకయ్య, సుబ్బారావు, శారద, ఇమాంబి, సాంబయ్య, నాయక్ పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

తాడేపల్లి రూరల్: ప్రజాపోరు ఉద్యమ కరపత్రాల ఆవిష్కరణ మరియు పంపిణీ కార్యక్రమాన్ని శనివారం దుగ్గిరాల గ్రామంలో సీపీఎం నాయకులు నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ.. 14వ తేదీ మండల కేంద్రాల వద్ద ప్రజా సమస్యలపై జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ గ్రామ కార్యదర్శి డి. చిరంజీవి, మండల నాయకులు వై. లలిత, ఎం. కోటమ్మ, మధుసూదనరావు, ఎం. నాగమల్లేశ్వరరావు, ఎం. ఇందిర, బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో శనివారం పోస్టర్లను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా సీపీఎం పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ నాయకులు కొట్టే కరుణాకర్ రావు, వేముల దుర్గారావు, డీవీ భాస్కర్ రెడ్డి, వై.బర్నబాస్, గంజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో రవి తదితరులు

ప్రచారం ప్రారంభం

తాడికొండ: సీపీఎం నిర్వహిస్తున్న ప్రజాపోరును జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి అన్నారు. శనివారం తుళ్ళూరులో ప్రచార జాతాను ప్రారంభించాక ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకు పెరుగుతున్న ధరలతో ప్రజలు సతమతం అవుతున్నారని పేర్కొన్నారు. ఇది చాలదన్నట్లుగా విద్యుత్ చార్జీల భారం పెంచడం దారుణమన్నారు. ఉచిత ఇసుక సక్రమంగా అందించాలని తెలిపారు. పలు సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేశారు. 14న తుళ్ళూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం భాగ్యరాజు, వల్లభాపురం వెంకటేశ్వరరావు, నాయకులు కుంభా ఆంజనేయులు, పేరం బాబురావు, గైరబోయిన నాగేశ్వరరావు, షేక్ జానీ, బత్తుల వెంకటేశ్వరరావు, కైలా స్టాలిన్, బెజ్జం గరటయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా పడిపూజ

మంగళగిరి: పట్టణంలోని గౌతమ బుద్ధ రోడ్డులోని ఎస్.సురేష్ నివాసంలో ఆదివారం సాయంత్రం గురుస్వామి తోట శివశంకర్ స్వామి ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించనున్నారు. ఈ మేరకు శనివారం నిర్వాహకులు విలేకరులకు తెలిపారు. గురు స్వాములు శ్రీనివాసరావు, ఉమామహేశ్వర రావు, సందు సురేష్ బాబు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి వారి ఎనిమిది రకాల అభిషేకాలు జరుగుతాయని వెల్లడించారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

తెనాలి అర్బన్: చెంచుపేటలోని యాంబియంట్ టక్నో స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ ఫర్ పేరెంట్స్ కార్యక్రమాన్ని స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ షేక్ ఇర్షాద్ ప్రారంభించారు. విద్యార్థుల తల్లులు తయారు చేసి తీసుకువచ్చిన వంటకాలను ఆయన పరిశీలించి, రుచి చూచారు. అత్యధిక పోషక విలువలు ఉన్న వంటకాలకు బహుమతులు అందజేశారు. ఆద్యంతం ఈ కార్యక్రమం అందర్నీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో డైరెక్టర్ షేక్ సల్మా, ప్రిన్సిపల్ వై.లక్ష్మి ప్రసన్న, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వాదేశాలు అమలయ్యేలా చూడండి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం వెంకటేష్ డిమాండ్




తరగతులు నిర్వహిస్తున్న ఓ ప్రవేట్ స్కూల్‌లో ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తెనాలిఅర్బన్: ప్రభుత్వ ఆదేశాలను ప్రయివేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పాటించే విధంగా చూడాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం తరగతులు నిర్వహిస్తున్న పట్టణంలోని పలు విద్యాసంస్థల వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ర్యాంకుల పేరుతో విద్యార్థులను మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నారని ఆరోపించారు. సెలవు దినాల్లో విద్యాసంస్థలను నిర్వహిస్తున్న యాజమాన్యలపై చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఉన్నతాధికారులను కోరినా ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు లేవన్నారు. ప్రభుత్వ అధికారులు దాటవేత ధోరణితో వ్యవహించడం వలన ప్రయివేట్ విద్యాసంస్థల నిర్వాహకులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుండు శివ, తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెనూరి సాయి, ఉపాధ్యక్షుడు దినేష్, నాయకులు సన్నీ, జయదీప్, పండు, ప్రభాస్, అఖిల్, హేమంత్, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో షూటింగ్ సందడి

- బాబు జగ్జీవన్ రామ్ బయోపిక్ తాజా షెడ్యూలు షూటింగ్ ప్రారంభం
- భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్ పాత్రల్లో ఇద్దరు ఎమ్మెల్యేలు



జగ్జీవన్ రామ్, భగత్‌సింగ్, నేతాజీ పాత్రధారులపై క్లాప్ ఇస్తున్న విజయచంద్ర

తెనాలి: స్థానిక రత్న ఫార్చ్యూన్ కళ్యాణ మండపం ఆవరణలో బాబు జగ్జీవన్ రామ్ చలనచిత్రం రెండో షెడ్యూలు రెగ్యులర్ షూటింగ్ శనివారం ఉదయం ప్రారంభమైంది. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే జి.రామాంజనేయులు, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కేసన శంకరరావు పాల్గొని వివిధ సన్నివేశాలకు నటీనటులపై క్లాప్ కొట్టారు. టైటిల్ పాత్ర బాబు జగ్జీవన్‌రామ్ పాత్రలో మిలటరీ ప్రసాద్, భగత్ సింగ్‌గా ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు, చంద్రశేఖర్ ఆజాద్‌గా పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర నటిస్తున్నట్టు దర్శకుడు దిలీప్‌రాజా వెల్లడించారు. సాయంత్రం వీరిపై కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. తొలుత నరసింహరాజు, కావ్యకీర్తిపై సన్నివేశాన్ని తీయగా, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు క్లాప్‌కొట్టారు. వీరితోపాటు బి వెంకట స్వామి నాయుడు, అరవిందరాజా నటిస్తున్నారని దర్శకుడు దిలీప్‌రాజా సాయంత్రం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. తాజా షెడ్యూలులో బాబు జగ్జీవన్‌రామ్ స్వాతంత్ర్య ఉద్యమంలో పోషించిన పాత్ర, రాజకీయ నేపథ్యం వంటి స్ఫూర్తిదాయకమైన అంశాలను తెరకెక్కిస్తున్నట్టు తెలిపారు. జగ్జీవన్‌రామ్ బయోపిక్‌లో ఆరుగురు ఎమ్మెల్యేలు నటిస్తున్నారని, షూటింగ్ నిరవధికంగా కొనసాగుతుందని వివరించారు. చిత్రానికి డీఓపీగా మురళీకృష్ణ, కెమెరామెన్ వంశీ, ఆర్ట్ డైరెక్టర్ రత్నాకర్ కనపర్తి, ప్రొడక్షన్ ఇన్చార్జి శ్రీకాంత్, మేకప్ జనార్దన్, లైటింగ్ మణి, ప్రొడక్షన్ షేక్ హాజీ, పి.రమేష్ వ్యవహరిస్తున్నట్టు వివరించారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

తెనాలిరూరల్: మండలంలోని కొలకలూరు గ్రామంలో గల పీహెచ్‌సీని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ శ్రవణ్ బాబు శనివారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో వ్యాక్సిన్ నిల్వ చేసే డీప్ ఫ్రిజర్, ఐస్‌లైన్డ్ రిఫ్రిజిరేటర్(ఐఎల్ఆర్)లోని వ్యాక్సిన్‌లను పరిశీలించారు. అలానే కొలకలూరు ఉపకేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాలు పుట్టిన వెంటనే ఆరు వారాల నుండి ఐదేళ్ల వరకు ఏ విధముగా వేయాలి, ఏ వ్యాధులు రాకుండా పిల్లలను కాపాడవచ్చు వంటి అంశాలపై ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు వివరించారు.

విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వండి

తెనాలిఅర్బన్: విద్యతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్య ఇవ్వాల్సిన అవసరం ఉందని సెయింట్ జాన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ సూరజ్ మోహన్ పేర్కొన్నారు. నాజర్‌పేటలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన రన్నింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవన విధానంలో చాలా మార్పులు వచ్చాయని తెలిపారు. నిత్యం వివిధ పనులతో బీజీగా ఉంటూ ఆరోగ్యంపై ఎక్కువ మంది దృష్టి పెట్టలేకపోతున్నారని చెప్పారు. ప్రతి రోజు వ్యాయామం చేయడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం 2కె, 5కె, 10కె రన్‌లలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అనీ అరుణలత, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత



తెనాలిఅర్బన్: పట్టణంలో అక్రమ భవన నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా కొత్తపేటలో అనుమతులు లేకుండా నిర్మించిన శ్లాబ్‌ను శనివారం పగులు కొట్టారు. టీపీవో సాంబశివరావు కథనం ప్రకారం.. కొత్తపేట టౌన్‌చర్చి సమీపంలో ఓ స్థల యాజమని గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు రెండు ఫ్లోర్‌లు నిర్మించుకునేందుకు మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకున్నాడు. అతడు ఇటీవల మూడో అంతస్థును నిర్మించారు. విషయం తెలుసుకున్న అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ నేతృత్వంలో టీపీవో సాంబశివరావు తన సిబ్బందితో అక్కడకు చేరుకుని శ్లాబ్‌కు మూడు చోట్ల రంధ్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీపీవో సాంబశివరావు మాట్లాడుతూ తెనాలి పట్టణంలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మూడు ఫ్లోర్‌లకు మున్సిపాలిటీ అనుమతులు ఇస్తుందని తెలిపారు. అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటుకు రాయితీ

కొల్లిపర: విద్యుత్ బిల్లులు తగ్గించుకునేందుకు వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకునేందుకు కేంద్రప్రభుత్వం రాయితీని ఇస్తుందని , దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యుత్ శాఖ ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. శనివారం మండల విద్యుత్ కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం ద్వారా ఈ రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు ఒక కిలోవాట్ సామర్థ్యంకు రూ.30 వేలు, రెండు కిలోవాట్స్ సామర్థ్యంకు రూ.60వేలు, మూడో కిలో వాట్స్ సామర్థ్యంకు రూ.78 వేలు చొప్పున ప్రభుత్వం రాయితీ అందిస్తుందని తెలిపారు. ఎక్కువగా విద్యుత్ వినియోగించేవారు ఈ సోలార్ విధానం ద్వారా విద్యుత్ ఆదా చేయటంతో పాటు విద్యుత్ బిల్లు బారీగా తగ్గుతుందన్నారు. గత నెలలో మండలంలో తొలిసారిగా వల్లభాపురం గ్రామంలో గుంటక వెంకటేశ్వరరెడ్డి విద్యుత్ వినియోగదారునికి మూడో కిలోవాట్స్ సామర్థ్యంతో కలిగిన ఇంక్రీమస్ సోలార్ వారు జెముడుబాడు గ్రామానికి చెందిన సోలార్ టెక్నీషియన్ వింతా శివనాగిరెడ్డి బిగించారు.